క్లుప్తంగా

సైబర్ మోసాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ ప్రసాద్

పాలసముద్రం: సైబర్ మోసాలు, దిశా యాప్‌పై అవగాహన పెంచుకోవాలని ఎస్ఐ ప్రసాద్ ప్రజలకు సూచించారు. గురువారం ఆముదాల దళితవాడలో సైబర్ మోసాలపై గ్రామస్తులకు ఆయన అవగాహన సమావేశం నిర్వహించారు. ఏఎస్ఐ చక్రవర్తి, మురుగేష్ పాల్గొన్నారు.

ఘనంగా కంప్యూటర్ సెక్యూరిటీ డే



మాట్లాడుతున్న ప్రిన్సిపల్

కార్వేటినగరం: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రపంచ కంప్యూటర్ సెక్యూరిటీ దినోత్సవాన్ని గురువారం ఘనంగా జరుపుకున్నారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ విజియులురెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో సాంకేతిక ఉపకరణాల వినియోగం అనివార్యం అని, సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం విద్యార్థులు సైబర్ నేరాలకు సంబంధించిన తమ స్వానుభావాలను పంచుకున్నారు. అధ్యాపకులు డాక్టర్ సీఎస్ లత, ఎస్.కార్తీక్, లావణ్య, వ్యాయామ ఉపాధ్యాయుడు జోగిప్రసాద్ పాల్గొన్నారు.

సామాజిక తనిఖీ బహిరంగ సభ రేపు

నగరి: ఉపాధి హామీ పనులపై 16వ విడత సామాజిక తనిఖీ నిర్వహించడం జరిగిందని ఎంపీడీఓ లీలామాధవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అందులో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద 2022 ఏప్రిల్ 1వ తేదీ నుంచి 2023 మార్చి 31 వరకు 21 గ్రామ పంచాయతీల పరిధిలో జరిగిన పనులకు సంబంధించి జరిగిన సామాజిక తనిఖీలో కనుగొన్న అంశాలపై శనివారం బహిరంగ సభ నిర్వహిస్తామన్నారు.

జెండర్ ఆధారిత హింస నేరం



ర్యాలీ చేస్తున్న మహిళలు

పాలసముద్రం: లింగ వివక్ష, బాల్యవివాహాలు, గృహ హింస చట్టరీత్యా నేరమని ఐకేపీ ఏపీఎం ఫరిదుమస్తాన్ తెలిపారు. గురువారం ఐకేపీ కార్యాలయంలో మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో జెండర్ ఆధారిత హింసకు వ్యతిరేకంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. సీసీ లోకనాథం, సంఘమిత్ర మురగయ్య పాల్గొన్నారు.

ఓటరు నమోదుపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్

వెదురుకుప్పం: మండలంలోని 49కొత్తపల్లి మిట్ట విశ్వేశ్వర జూనియర్ కళాశాల, వెంకటాపురం గ్రామంలో విద్యార్థులకు, గ్రామస్తులకు ఓటరు నమోదుపై తహసీల్దార్ బెన్నూరాజు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతి పౌరుడు సంబంధిత బీఎల్ఓ ద్వారా ఓటరుగా నమోదు చేసుకోవాలని అన్నారు. మండల సర్వేయర్ మురళి, ఎస్ఐ షేక్షావలి పాల్గొన్నారు.

చోరీ కేసులో ఒకరికి జైలు శిక్ష



ముద్దాయిని జైలుకు తరలిస్తున్న పోలీసులు

నగరి: బంగారు నగల చోరీ కేసులో గుండ్రాజుకుప్పం గ్రామానికి చెందిన జీపీ సాయికుమార్ (22)కు జూనియర్ సివిల్ మెజిస్ట్రేట్ విష్ణువర్మ 6 నెలల జైలు శిక్ష రూ.2 వేల జరిమానా విధించారు. సీఐ సురేష్ తెలిపిన వివరాల మేరకు.. నగరి పట్టణంలో 2018లో జరిగిన చోరీ కేసును విచారించిన పోలీసులు సాయికుమార్‌ను అరెస్ట్ చేసి ఐపీసీ సెక్షన్ 380 రెడ్‌విత్ 411, క్రైమ్ నంబరు 79/2018 కింద కేసు నమోదు చేశారు. గురువారం ఈ కేసు నగరి కోర్టులో విచారణకు వచ్చింది. ఏపీపీ రామశాంతి వాదనలు విన్న అనంతరం జడ్జి విష్ణువర్మ నిందితుడికి ఆరు నెలల జైలుశిక్ష, రూ.2 వేల జరిమానా విధించారు. కోర్టు కానిస్టేబుల్ నవీన్‌కుమార్ ముద్దాయిని జిల్లా జైలుకు తరలించారు.

ప్రజల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూర్చాం
- ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు పల్లెనిద్ర
- కాయం గ్రామంలో మంత్రి రోజా



సాక్షి పత్రికను చదువుతున్న మంత్రి రోజా



గడప గడపలో సంక్షేమ బుక్‌లెట్ అందిస్తున్న మంత్రి రోజా

పుత్తూరు: ప్రజలతో మమేకం అయినప్పుడే వారి సమస్యలు తెలుస్తాయని, అందుకే సీఎం జగనన్న ప్రజాప్రతినిధులైన తమను ప్రజల మధ్యకు పంపుతున్నారని మంత్రి ఆర్కే రోజా అన్నారు. గురువారం ఆమె వడమాలపేట మండలం కాయం గ్రామంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో భాగంగా పల్లె నిద్ర చేశారు. ముందుగా ఆమె 'సాక్షి' పత్రికతో దిన చర్యను ప్రారంభించారు. స్థానికులతో కలిసి కాఫీ తాగుతూ వార్తా విశేషాలను అందరితో పంచుకున్నారు. స్థానికంగా ఇప్పటి వరకు చేసిన అభివృద్ధి, చేయాల్సిన కార్యక్రమాలపై గ్రామస్తులతో చర్చించారు. అందుకు తగిన కార్యాచరణ ప్రణాళికలను సిద్ధం చేయాల్సిందిగా స్థానిక నాయకులను ఆదేశించారు. అనంతరం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ప్రారంభించారు. నేటి జగనన్న ప్రభుత్వం నాలుగున్నరేళ్లుగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. అవ్వా పెన్షన్ అందిందా? అక్కా చేయూత అందిందా? ఆరోగ్యశ్రీ పథకం వర్తించిందా? అమ్మఒడి అందుతోందా? అని ఆరా తీశారు. ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలకరిస్తూ బుక్‌లెట్‌లోని వివరాల మేరకు మీకు అన్ని పథకాల లబ్ధి అందిందా అంటూ ఆరా తీశారు. తమకు పథకాలు అందుతున్నాయని సమాధానం చెప్పారు.

జగనన్న సైనికులుగా పని చేద్దామా ?

ప్రతి కుటుంబం ఆర్థికాభివృద్ధి సాధించాలంటే రాష్ట్రానికి జగనన్న మళ్లీ ముఖ్యమంత్రి కావాలని, ఇందుకు జగనన్న సైనికురాలిగా పనిచేయడానికి తాను సిద్ధమని, మీరు సిద్ధమా అంటూ ప్రశ్నించారు. అందరూ ముక్తకంఠంతో తామూ సిద్ధమేనంటూ సమాధానం ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రి రోజా మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేనివిధంగా నేటి జగనన్న ప్రభుత్వంలో ప్రతి గడపకూ సంక్షేమ పథకాల ద్వారా రూ.లక్షల్లో లబ్ధి చేకూరుతోందని తెలిపారు. ప్రజలకు వంద శాతం సంక్షేమం, అభివృద్ధి అందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వ పని చేస్తోందని చెప్పారు. ఎన్నికల సమయంలో అబద్ధపు హామీలు గుప్పించే చంద్రబాబు నాయుడు, తర్వాత ప్రజలను మోసం చేయడం ఆయన నైజమన్నారు. జగనన్న ఇచ్చిన హామీలనే కాకుండా, చెప్పని పలు కార్యక్రమాలను సైతం చేశారని, అదే వైఎస్సార్ కుటుంబ నైజమన్నారు. ఆరోగ్యవంతమైన సమాజం కోసం గర్భిణులకు, బాలింతలకు, చిన్నపిల్లలకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా నాణ్యమైన పౌష్టికాహారం అందిస్తున్నట్లు వివరించారు. అనేక విధాలుగా ప్రజలకు చేయూతనిస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని ప్రజలు మరోసారి ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ సుబ్రమణ్యం, ఎంపీడీఓ భానుమూర్తి, మండల కన్వీనర్ సుబ్రమణ్యంరెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ కరుణాకర్‌చౌదరి, శాప్ డైరెక్టర్ యాదవేంద్రరెడ్డి, కాణిపాకం ఆలయ కమిటీ సభ్యురాలు, ఎంపీటీసీ ప్రతిమ, పార్టీ నాయకులు సురేష్‌రాజు, చంద్రారెడ్డి, కిరణ్‌కుమార్, సుధీర్‌రెడ్డి, మునిశేఖర్, గాంధీ తదితరులు పాల్గొన్నారు.

కార్వేటినగరంలో..

కార్వేటినగరం: ఎంఎం విలాసం సచివాలయం పరిధిలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డును ప్రారంభించారు. పార్టీ జెండాను ఆవిష్కరించారు. సర్పంచ్ జ్యోతి, మండల పార్టీ కన్వీనర్ శేఖర్‌రాజు, జేసీఎస్ కన్వీనర్ పురంధర్, సింగిల్ విండో అధ్యక్షుడు లోకనాథరెడ్డి, నేతలు దొరస్వామి, చంద్ర, రాజా, మాణిక్యరెడ్డి, ఎంపీడీఓ మోహన్‌మురళి, ఈఓపీఆర్డీ లక్ష్మీపతి పాల్గొన్నారు.

గంగాధరనెల్లూరులో..

గంగాధర నెల్లూరు: కడపగుంట సచివాలయంలో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి అనే కార్యక్రమాన్ని వైఎస్సార్‌సీపీ నేతలు నిర్వహించారు. సర్పంచ్ బుజ్జి, ఎంపీటీసీ ఉమామహేశ్వరి, జేసీఎస్ మండల కన్వీనర్ వెంకటేష్‌రెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ వేలు మొదలియార్, నేతలు పుష్పరాజ్, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ సుధాకర్, ఈఓపీఆర్డీ రాఘవేంద్రరాజు పాల్గొన్నారు.

శ్రీరంగరాజపురం: వీవీ పురం సచివాలయంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ నేతలు సచివాలయంలో ఏర్పాటు చేసిన సంక్షేమ పథకాల బోర్డును ప్రారంభించారు. వీవీపురం ప్రధాన కూడలిలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. అలాగే గృహసారథులకు జగనన్న కిట్లను అందజేశారు. పార్టీ మండల కన్వీనర్ మణి, జెడ్పీటీసీ రమణప్రసాద్‌రెడ్డి, సర్పంచ్ లక్ష్మమ్మ, తహసీల్దార్ బెన్నూరాజు, ఎంపీడీఓ కష్టయ్య, నేతలు జనార్దన్, దామునాయుడు, డిసెంబర్‌శెట్టి, ప్రసాద్‌రెడ్డి, దాముఆచారి పాల్గొన్నారు.



ఎంఎం విలాసంలో..



కడపగుంటలో జెండా ఆవిష్కరిస్తున్న నేతలు

వెదురుకుప్పంలో..

వెదురుకుప్పం: స్థానిక సచివాలయం వద్ద వై ఏపీ నీడ్స్ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం సచివాలయంలో సంక్షేమ పథకాల బోర్డును ప్రారంభించి, జెండాను ఆవిష్కరించారు. మండల అధ్యక్షుడు పద్మనాభరెడ్డి, సర్పంచ్ శిల్ప, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సుబ్రమణ్యం, నేతలు రామయ్య వెంకటేష్, పెద్దరెడ్డి, గోపి పాల్గొన్నారు.

పెనుమూరులో..

పెనుమూరు(కార్వేటినగరం): రామకృష్ణాపురం సచివాలయంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంల నిర్వహించారు. ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని వైఎస్సార్‌సీపీ నేతలు ప్రారంభించారు. అనంతరం సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు. అదే విధంగా పార్టీ జెండాను ఎగురవేశారు. సర్పంచ్ వెంకటేష్, ఎంపీపీ హేమలతారెడ్డి, జెడ్పీటీసీ దొరస్వామియాదవ్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు విజయకుమార్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ కమలాకర్‌రెడ్డి, మహిళా అధ్యక్షురాలు యశోదారెడ్డి, రాష్ట్ర వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ మనోహర్, జిల్లా కార్యవర్గ సభ్యుడు మోహన్, జేసీఎస్ కన్వీనర్ హరికృష్ణ, ఎస్సీసెల్ అధ్యక్షుడు దాము, బీసీ సెల్ అధ్యక్షుడు నీలా పండరీనాథ్ పాల్గొన్నారు.



జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు



వెదురుకుప్పంలో జెండా ఆవిష్కరిస్తున్న నేతలు



పెనుమూరు: కరపత్రాల పంపిణీ

టేక్ హోం రేషన్ తేదీల్లో స్వల్ప మార్పు

నగరి: నగరి ఐసీడీఎస్ పరిధిలోని నగరి, విజయపురం, నింద్ర మండల పరిధిలోని 202 అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలు, 7 నుంచి 3 సంవత్సరాల పిల్లలకు అందించే టేక్‌హోం రేషన్ తేదీల్లో స్వల్ప మార్పు జరిగిందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె.కృష్ణవేణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. డిసెంబరు 2023 నెలలో మొదట విడతగా డిసెంబరు 8వ తేదీన అంటే 2వ శుక్రవారం 3 కేజీల బియ్యం, 1 కేజీ కందిపప్పు, అరలీటరు నూనె, 13 కోడిగుడ్లు, 2.5 లీటర్ల పాలు, 2.5 కేజీల బాలామృతం ప్యాకెట్లను అందిస్తామన్నారు. 2వ విడతగా డిసెంబరు 22వ తేదీన అంటే 4వ శుక్రవారం టేక్ హోం రేషన్ ద్వారా వైఎస్సార్ కిట్ కోడిగుడ్లు 12, పాలు 2.5 లీటర్ల పాలు లబ్ధిదారులకు అందిస్తామన్నారు. ప్రతి నెల 2వ శుక్రవారం, 4వ శుక్రవారం టేక్‌హోం రేషన్ ఉంటుందని, ఇది గమనించి పాటించాలన్నారు.

మీరాసాహెబ్‌పాళెంలో ప్రత్యేక వైద్యశిబిరం



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ రవిరాజు

నగరి: మండలంలోని మీరా సాహెబ్‌పాళెం గ్రామంలో డెంగీ పాజిటివ్ కేసు ఒకటి నమోదు కావడంతో డీఎంఓ డాక్టర్ రవిరాజు వైద్యబృందంతో పాటు గురువారం మీరాసాహెబ్‌పాళెంకు చేరుకున్నారు. డెంగీ పాజిటివ్ వచ్చిన వ్యక్తి నివాస ప్రాంతాలను పరిశీలించి అపరిశుభ్రంగా పరిసరాలను ఉంచుకోవడమే డెంగీ దోమ రావడానికి కారణమైందని తేల్చారు. అపరిశుభ్రంగా ఉన్న ప్రాంతాల్లో దోమల నివారణ మందులు పిచికారీ చేయించారు. ప్రతి ఇంటికీ వెళ్లి జ్వరం వచ్చిన కేసులపై ఆరాతీశారు. డెంగీ దోమలు ఉత్పత్తి కావడానికి ఉన్న కారణాలను నివాశితులకు విశదీకరించారు. శుక్రవారం డ్రైడే పాటించాలని వారికి సూచించారు. కార్యక్రమంలో ఎస్‌యూఓలు, ఎంపీహెచ్‌ఈఓ, ఎంపీహెచ్ఎస్, ఏఎన్ఎం, ఆశాలు పాల్గొన్నారు.

యూటీఎఫ్ కార్యవర్గం ఎన్నిక



శ్రీనివాసులు, రూబెన్

విజయపురం (నగరి): విజయపురం మండల యూటీఎఫ్ అధ్యక్షుడిగా శ్రీనివాసులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గురువారం పన్నూరులో మండల కౌన్సిల్ సమావేశం చిత్తూరు జిల్లా కార్యదర్శి ఎస్.మణిగండన్, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు కే.వంశీకృష్ణ ఆధ్వర్యంలో జరిగింది. సమావేశంలో ఆడిట్ నివేదికను సమర్పించడంతో పాటు సంఘ కార్యక్రమాలను విశ్లేషించారు. అనంతరం యూటీఎఫ్ మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండల యూటీఎఫ్ అధ్యక్షుడిగా ఎం.శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శిగా కే.రూబెన్, గౌరవ అధ్యక్షుడిగా సి.రవి, కోశాధికారిగా భాగ్యరాజ్, మహిళా అధ్యక్షుడిగా ఎం.చంద్రకళ, ఉపాధ్యక్షులుగా కులశేఖర్, హరికృష్ణ, సురేష్, సీపీఎస్ కన్వీనర్‌గా హరిప్రసాద్, ఐక్య ఉపాధ్యాయ కన్వీనర్‌గా బి.మణి, జిల్లా కౌన్సిలర్లను, హైస్కూల్ ప్రతినిధులను మండల కార్యదర్శులను, మహిళా కార్యదర్శులను ఎన్నుకున్నారు.

ఊపందుకున్న క్రీడాకారుల రిజిస్ట్రేషన్



క్రీడాకారుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్న విస్తరణాధికారి రమేష్

పాలసముద్రం: ఆడుదాం ఆంధ్రా టోర్నీలో పాల్గొనే క్రీడాకారుల రిజిస్ట్రేషన్ మండలంలో ఊపందుకుందని విస్తరణాధికారి రమేష్ తెలిపారు. గురువారం మండలంలో అన్ని సచివాలయాల్లో క్రీడాకారుల వివరాలు రిజిస్ట్రేషన్ నమోదు కార్యక్రమం ఊపందుకుంది. పలువురు క్రీడాకారులు మాట్లాడుతూ ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా పోటీల వల్ల గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న తమకు మంచి అవకాశం అన్నారు. మండలస్థాయిలో, జిలాస్థాయి పోటీల్లో ప్రతిభ చాటితే రాష్ట్రస్థాయి క్రీడాపోటీల్లో ఆడే అవకాశం కల్పించడం హర్షించదగ్గ విషయమన్నారు. ప్రభుత్వమే క్రీడాకారులకు అవసరమైన కిట్లు, సామగ్రిని కూడా పంపిణీ చేస్తోందని తెలిపారు.

సెక్టోరియల్ అధికారులతో సమీక్ష



మాట్లాడుతున్న డెప్యూటీ కలెక్టర్ భవాని

గంగాధర నెల్లూరు: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో గురువారం నియోజకవర్గ స్థాయి సెక్టోరియల్ అధికారులతో డెప్యూటీ కలెక్టర్ భవాని సమీక్ష నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రతి పోలింగ్‌స్టేషన్‌ను సెక్టోరియల్ అధికారులు క్షుణ్ణంగా పరిశీలించాలని, అక్కడ పరిస్థితిని ఉన్నతాధికారులకు తెలియజేయాలన్నారు. పోలింగు నిర్వహణ పూర్తి బాధ్యత సెక్టోరియల్ అధికారులదే అని అన్నారు. తహసీల్దార్ ఇన్బనాథన్, ఎన్నికల డీటీ విజయ క్రిష్ణ, ఆరు మండలాల అధికారులు పాల్గొన్నారు.

ఆసక్తి కలిగేలా బోధన చేయాలి



మాట్లాడుతున్న ఎంఈఓ గిరిజ

పాలసముద్రం: ఫిజికల్ సైన్స్‌పై విద్యార్థులకు ఆసక్తి కలిగేలా ఉపాధ్యాయులు బోధన చేయాలని ఎంఈఓ-2 గిరిజ తెలిపారు. గురువారం పాలసముద్రం ఉన్నత పాఠశాలలో కార్వేటినగరం, శ్రీరంగరాజపురం, పాలసముద్రం మండల సైన్స్ ఉపాధ్యాయులకు సైన్స్ విద్యాబోధనపై సమావేశం జరిగింది. ఎంఈఓ గిరిజ మాట్లాడుతూ విద్యార్థులకు అనుగుణంగానే విద్యను బోధించాలని తెలిపారు. సీఆర్పీలు శరవణన్, మునిరాజ్, రాజేశ్వరి, మహాలక్ష్మి, ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పౌష్టికాహార పంపిణీ తేదీల్లో మార్పులు

గంగాధర నెల్లూరు: గర్భిణులకు, బాలింతలకు, పిల్లలకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారం పంపిణీ తేదీల్లో మార్పులు చేసినట్లు మండల ఐసీడీఎస్ సీడీపీఓ వినితశ్రీ తెలిపారు. ఆమె మాట్లాడుతూ డిసెంబర్ నెలకు సంబంధించి పౌష్టికాహార పంపిణీ రెండవ శుక్రవారం 8వ తేదీ, నాల్గవ శుక్రవారం 22వ తేదీల్లో రెండు విడతలుగా అందజేస్తారని పేర్కొన్నారు.

ఆయుష్మాన్‌భవ భారత్ పేదలకు వరం

- జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి



ఆయుష్మాన్ భవ కార్డులను అందిస్తున్న జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి

పెనుమూరు(కార్వేటినగరం): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన ఆయుష్మాన్ భవ భారత్ పథకం పేదలకు ఓ వరమని జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి అన్నారు. గురువారం తాటిమాకుల పంచాయతీ, ఎర్రమట్టిపల్లిలో వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమాన్ని జెడ్పీ సీఈఓ ప్రారంభించారు. జెడ్పీ సీఈఓ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేదల ఆరోగ్యం కోసం ఆయుష్మాన్ భవ పథకాన్ని ప్రవేశపెట్టి ఏడాదికి కేంద్రం రూ.5లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్యశ్రీ ద్వారా రూ.2లక్షల వరకు వైద్యం అందిస్తోందన్నారు. అలాగే పీఎం కిసాన్ ద్వారా కేంద్రప్రభుత్వం, వైఎస్సార్ రైతు భరోసా పథకం కింద లబ్ధిదారులకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల ఖాతాలోకి నేరుగా జమచేస్తున్నాయని గుర్తు చేశారు. అలాగే పేదలకు సొంతింటి కల నెరవేర్చడానికి ప్రధానమంత్రి ఆవాస యోజన, పేదలందరికి పక్కాగృహాలు పథకం ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇళ్ల నిర్మాణాలు, పేదలకు ఉచిత రేషన్ బియ్యం లాంటి 18 రకాల సంక్షేమ పథకాలను రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్నాయని అన్నారు. రెండు ప్రభుత్వాలు అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు తెలియజేయడానికి వికసిత్ భారత్ సంకల్పయాత్ర నిర్వహిస్తారన్నారు. ఎంపీపీ హేమలతారెడ్డి, జెడ్పీటీసీ దొరస్వామియాదవ్, ఎంపీడీఓ నీలకంఠేశ్వర్ రెడ్డి, వైద్యాధికారి డాక్టర్ హర్షవర్ధన్, ఎంఈఓ భాస్కర్‌నాయుడు, మాజీ ఎంపీటీసీ గురుమూర్తి, మాజీ సర్పంచ్ చెంగల్రాయులు పాల్గొన్నారు.

నాలుగున్నరేళ్లలో రూ.348 కోట్లతో సంక్షేమం

- త్వరలో రూ.13 కోట్లతో వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్
- మున్సిపల్ సమావేశంలో చైర్మన్ హరి



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ హరి

పుత్తూరు: గడిచిన నాలుగున్నరేళ్లలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఒక్క పుత్తూరు పట్టణ పరిధిలో రూ.348 కోట్లతో సంక్షేమం, అభివృద్ధి చేపట్టిందని మున్సిపల్ చైర్మన్ ఎ.హరి తెలిపారు. గురువారం స్థానిక వైఎస్సార్ సమావేశ మందిరంలో మున్సిపల్ చైర్మన్ హరి ఆధ్వర్యంలో మున్సిపాలిటీ సాధారణ సమావేశం జరిగింది. ముందుగా అజెండాలోని వివరాలను చదివి వినిపించారు. అనంతరం హరి మాట్లాడుతూ పార్టీలకు, రాజకీయాలకు అతీతంగా మున్సిపాలిటీలోని ప్రతి వార్డులో ప్రభుత్వ సంక్షేమం, అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. పుత్తూరు పట్టణంలోని ప్రజలకు వివిధ సంక్షేమ పథకాల ద్వారా ప్రత్యక్ష లబ్ధి కింద రూ.221 కోట్లు, అభివృద్ధి పనుల పరోక్ష లబ్ధి కింద రూ.127 కోట్లు కలిపి మొత్తం రూ.348 కోట్లను నేటి ప్రభుత్వం వ్యయం చేసినట్లు వివరించారు. ప్రభుత్వం అమృత్ 2.0 ప్రాజెక్టు కింద పుత్తూరుకు రూ.13 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ నిధులతో చెర్లోపల్లి పెట్రోల్ బంకు ఎదురుగా ఉన్న ప్రభుత్వ స్థలంలో 7.0 ఎంఎల్‌డీ కెపాసిటీ గల వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంటును నిర్మిస్తున్నట్లు చెప్పారు. గతంలో ఏ ప్రభుత్వం కూడా ఇన్ని సంక్షేమ పథకాలను అమలు చేసిన దాఖలాలు లేవన్నారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ కెఎల్‌ఎన్‌రెడ్డి, డీఈఈ చంద్రశేఖర్ రెడ్డి, వైస్ చైర్మన్లు డి.శంకర్, డి.జయప్రకాష్, కౌన్సిలర్లు, కోఆప్షన్ మెంబర్లు పాల్గొన్నారు.

సమావేశంలో ఆమోదించిన తీర్మానాలు

- చెర్లోపల్లి పెట్రోల్ బంకు ఎదురుగా సర్వే నెంబర్ 19 లోని ప్రభుత్వ స్థలంలో రూ.13 కోట్లతో వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ నిర్మాణం
- 24వ వార్డులోని చింతలగుంట వద్ద మినీ పార్కు స్థలంలో రూ.19.49 లక్షలతో కాంపౌండ్ వాల్ నిర్మాణం
- రూ.26 లక్షలతో వివిధ వార్డుల్లో 10 సీసీ రోడ్ల నిర్మాణాలు
- 1వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో స్థానిక ప్రజల అభ్యర్థన మేరకు రూ.40 లక్షలతో వివిధ అభివృద్ధి పనులు

అన్ని వార్డుల్లో ప్రాధాన్యత మేరకు అభివృద్ధి పనులు

- విస్తృతంగా నీటి సరఫరా పనులు
- మున్సిపల్ చైర్మన్ పీజీ.నీలమేఘం



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ నీలమేఘం

నగరి: ప్రాధాన్యతానుసారం అన్ని వార్డుల్లో అభివృద్ధి పనులు చేపడుతున్నామని మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం అన్నారు. గురువారం నగరి మున్సిపల్ కార్యాలయంలో ఆయన మున్సిపల్ అత్యవసర సమావేశం నిర్వహించారు. ఇన్‌చార్జ్ మున్సిపల్ కమిషనర్ కెఎల్ఎన్ రెడ్డి సమావేశపు అజెండాను సభ్యులకు చదివి వినిపించారు. అజెండాలో ఏవైనా అభ్యంతరాలుంటే తెలపాలన్నారు. ఈ సందర్భంగా వైస్‌చైర్మన్ వెంకటరత్నం, విప్ దయానిధి, కౌన్సిలర్లు భారతి, గోపాల్‌రెడ్డి, ఇంద్రయ్య వార్డుల్లో చేపట్టవలసిన రోడ్లు, కాలువలు, విద్యుత్ స్తంభాల ఏర్పాటు, జగనన్న కాలనీలలో పరస్పర స్థలమార్పు తదితర సమస్యలను కౌన్సిల్ దృష్టికి తీసుకువచ్చారు. వాటికి కమిషనర్ సమాధానమిస్తూ అన్ని సమస్యలు నమోదు చేసుకున్నామని వాటిని పరిష్కరిస్తామన్నారు. విద్యుత్ స్తంభాల ఏర్పాటు, లైన్ల మార్పునకు సంబంధించి ట్రాన్స్‌కో ఏడీ సమాధానమిచ్చారు. అనంతరం మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం మాట్లాడుతూ మంత్రి ఆర్కేరోజా సహకారంతో మున్సిపాలిటీ పరిధిలో గడప గడపకు నిధుల ద్వారా 16, 21 వార్డుల్లో రూ.40 లక్షల మేర రోడ్లు, కాలువలు, కల్వర్టు, నీటిసరఫరా పనులు చేపడుతున్నట్లు చెప్పారు. పుదుపేట నార్త్ అర్బన్ హెల్త్ సెంటర్‌కు ప్రధాన రహదారిలో నేమ్‌బోర్డు ఏర్పాటుకు, సంతమైదానం వద్ద కొత్తగా నిర్మిస్తున్న కాంప్లెక్స్‌కు తాగునీటి పైపులైన్ ఏర్పాటు చేసేందుకు, వీధి దీపాల నిర్వహణకు రూ.99 వేల వ్యయంతో స్పేర్‌పార్ట్స్ కొనుగోలుకు, 45 జీరో అసెస్‌మెంట్లను పరిష్కరించడానికి కౌన్సిల్ ఆమోదం తెలిపింది. సమావేశంలో వైస్ చైర్మన్ బాలన్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.